# మన అంతరంగిక భద్రతా వ్యవస్థ బలమెంత?

**దేశంలో చోటు చేసుకుంటున్న ఉగ్రవాద దాడులు, బాంబు విస్ఫోటనాలు.. సగటు పౌరుడి మదిలో 'మన భద్రత వ్యవస్థ బలమెంత'? అనే సందేహాన్ని కలిగిస్తున్నాయి. 17 రాష్ట్రాల మీదుగా.. ఏడు దేశాలతో వేల కిలోమీటర్లతో సరిహద్దు కలిగుండటం అక్రమ చొరబాటుదారు లకు, విదేశీ తీవ్రవాదులకు అనుకూలంగా మారుతోంది. మనదేశంతో పొరుగు దేశాల శతృత్వ వైఖరీ, దీనికితోడు వివిధ రాష్ట్రాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు...సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంతరంగిక భద్రతను పటిష్ట పరచాల్సిన అవశ్యకత ఎంతో ఉంది...**

ఇటీవల ముంబై దాడుల నేపథ్యంలో మన భద్రతా వ్యవస్థ పటిష్టతపైన, సన్నద్ధతపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. రవాణా, సమాచార రంగాల్లో జరుగుతున్న సాంకేతిక విప్లవాల ఫలితంగా ఉగ్రవాద చర్యల్లోనూ ప్రపంచీకరణ చోటుచేసుకుం టోంది. ఓవైపు ఆర్థిక, ప్రాంతీయ అసమానతలతోపాటు.. కుల, మత, భాషాభేదాలు అంతర్గత భద్రతకు సవాళ్లు విసురుతుంటే.. మరోవైపు పొరుగుదేశాల శత్రుత్వ వైఖరి అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. దీనికి తోడు మన ఉద్యోగిస్వామ్య, పోలీస్ యంత్రాంగ నిర్లిప్త ధోరణి, అవినీతి దేశ ఉనికినే ప్రశ్నిస్తున్నాయి. మన రాజకీయ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న కొన్ని ప్రతికూల వైఖరులు.. జాతి విద్రోహశక్తుల పట్ల కఠినంగా వ్యవహరించ కుండా చేస్తున్నాయి. ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వయుగంలో కేంద్రం మరింత నిస్తేజమవుతోంది.

## అంతరంగిక భద్రతా బాధ్యత ఎవరిది?

రాజ్యాంగ నిబంధనల ప్రకారం– 'ప్రజా భద్రత', 'పోలీస్' అనే రెండు అంశాలు రాష్ట్ర జాబితాలోకి వస్తాయి. వాటి ప్రకారం శాంతి భద్రతల నిర్వహణా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కాని, 355వ రాజ్యాంగ ప్రకరణ మేరకు ''రాష్ట్రాలను విదేశీదాడుల నుంచి, అంతర్గత అలజడుల నుంచి రక్షించి రాజ్యాంగ నిబంధనల మేరకు పాలన జరిగేలా చూడవలసిన బాధ్యత మాత్రం కేంద్ర ప్రభుత్వానిదే''. అతంత మాత్రపు వనరులతో సతమతమవుతున్న రాష్ట్రాలు, గత్యంతరం లేక శాంతి భద్రతల నిర్వహణకు కేంద్రం మీద ఆధారపడుతున్నాయి. దానికితోడు అంతర్జాతీయ ఉగ్రవాద చర్యలను నివారించే శక్తి సామర్థ్యాలు కూడా ఆ రాష్ట్రాలకు లేకపోవడంతో.. ఆ బరువు బాధ్యతలు కూడా కేంద్రంపైనే పడుతున్నాయి. కేంద్ర అంతరంగిక వ్యవహారాల మంత్రిత్వశాఖ దేశీయ భద్రతకు బాధ్యత వహిస్తుంది. మన పొరుగు దేశాలైన బంగ్లాదేశ్‌తో 4096.7 కి.మీ., చైనాతో 3488 కి.మీ., పాకిస్తాన్‌తో 3323 కి.మీ., నేపాల్‌తో 1751 కి.మీ., మయన్మార్‌తో 1643 కి.మీ., భూటాన్‌తో 699 కి.మీ., అఫ్గాని స్తాన్‌తో 106 కి.మీ. పొడవు సరిహద్దు భారత్ కలిగుంది. ఈ సరి హద్దులు 17 రాష్ట్రాల్లో 92 జిల్లాల్లో వ్యాపించాయి. దీనికి తోడు 13 రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను తాకుతూ 7516.6 కి.మీ. సముద్రతీర ప్రాంతం ఉంది. సరిహద్దు భూభాగం, తీర ప్రాంతం నుంచి చొరబడుతున్న అక్రమ చొరబాటుదారులు, జాతి విద్రోహశక్తులు.. మాదకద్రవ్యాలు, ఆయుధాలు, అక్రమ రవాణాదారులు మన అంతరంగిక భద్రతకు సవాళ్లు విసురు తునే ఉంటారు. మన పొరుగు దేశాలన్నీ దాదాపు మనతో శత్రుత్వ వైఖరిని కలిగి ఉన్నవే. నేపాల్, భూటాన్, శ్రీలంక లాంటి దేశాలతో మన సంబంధాలు మెరుగ్గా ఉన్నప్పటికీ అవి తమ అంతర్గత సమస్యలతో సతమతమవుతూ, సరిహద్దుల్లో పటిష్టంగా కాపలా కాసే స్థితిలో లేవు.

## మరెన్నో సమస్యలు:

ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో వేర్పాటువాదుల ఉగ్రవాద చర్యలు, జమ్మూ- కాశ్మీరు, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలకు పాకి స్థాన్ నుంచి ముప్పు; మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలకు నక్సలైట్ల నుంచి ముప్పు; తమిళనాడు కు ఎల్‌టీటీఈ నుంచి ముప్పు వంటి అనేక సమస్యలు మనల్ని కలవరపెడుతున్నాయి. దీనికి తోడు దేశంలో వివిధ ప్రాంతాల్లో కుల, మత, ప్రాంతీయ విభేదాల కారణంగా చెలరేగే అల్లర్లు ప్రజల్లో అభద్రతా భావాన్ని కలిగిస్తున్నాయి. ఇవి.. సమైక్య ధోరణి కంటే వేర్పాటువాద ధోరణి బలం పుంజుకునేట్లు చేస్తున్నాయి. కేంద్ర సాయుధ బలగాలు (పారా మిలిటరీ ఫోర్సెస్) రాష్ట్ర ప్రభుత్వాలకు శాంతి భద్రతల నిర్వహణలో తోడ్పడుతున్నాయి. కాని, చాలా సందర్భాల్లో ఈ బలగాలు మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. స్థానికుల నుంచి వారికి కావలసిన సమాచారం, సహాయం లభించకపోవడానికి కారణం వీరి దౌర్జన్య చర్యలే. ఎక్కువ సందర్భాల్లో సగటు పౌరుడు అటు ఉగ్రవాదుల ఒత్తిళ్లకు, ఇటు పోలీస్, సాయుధ బలగాల వేధింపులకు బలవుతున్నాడు.

ప్రపంచీకరణ పేరుతో సమాజంలో అంతరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ కారణంతో.. బడుగు జీవుల జీవనో పాధిని నిర్లక్ష్యం చేయడం జరుగుతోంది. నక్సలిజాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగా పరిగ ణించకుండా సామాజిక -ఆర్థిక సమస్యగా పరిగణించాలి. జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం లాంటి వాటిని మరింత పటిష్టంగా అమలుచేస్తే, దానికి మించిన అంతరంగిక భద్రతా చర్య ఇంకొకటి ఉండదు. స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్లు దాటినప్పటికీ సగటు పౌరుడు కనీస అవసరాలను తీర్చుకోలేని స్థితిలో ఉన్నప్పుడు సమాజం హింసాయుతం కావడం సహజం. మరిన్ని సాయుధ బలగాలను ఏర్పరచి, సమాచార వ్యవస్థను పటిష్టం చేయడం కంటే సమసమాజ స్థాపనకు కృషి చేయడం ఎంతో అవసరం.

## పోలీస్ వ్యవస్థ ప్రక్షాళన అవసరం:

బలప్రయోగం ద్వారా శాంతి భద్రతలను నిర్వహించడం కష్టం. సంఘ విద్రోహ శక్తుల బారి నుంచి ప్రజలను రక్షించడానికి పోలీస్ యంత్రాంగం అవసరం. కాని సగటు పౌరుని దృష్టిలో పోలీస్ వ్యవస్థ ప్రజాహితం కాదనే అభిప్రాయం నెలకొంది. బ్రిటిష్‌కాలంలో సామ్రాజ్య ప్రయోజనాలను పరిరక్షించడానికి ఏర్పరచిన పోలీస్ యంత్రాంగ తీరులో ఈనాటికీ మార్పు లేదు. 'ప్రజలను దండించడానికే తప్ప.. ప్రజలకు సేవ చేయడానికి పోలీస్ వ్యవస్థ లేదు' అనే నకారాత్మక భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగులు సాధారణ ప్రజలపట్ల వ్యవహరించే తీరే ఇందుకు నిదర్శనం. ధనికులు, రాజకీయ నాయకులు, అధికా రంలోనున్నవారి పట్ల వారు చూపించే పక్షపాత వైఖరి ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వసనీయతను తగ్గిస్తుంది. పోలీస్ వ్యవస్థ సంస్కృతిలో మార్పు రానంతవరకు ప్రజలు వీరికి సహకరించడం సాధ్యం కాదు. అలాగని పూర్తిగా పోలీస్ ఉద్యోగులను నిందించలేం. వారు బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వహించాలంటే వారి భర్తీ, బదిలీ, పదోన్నతుల విషయంలో రాజకీయ జోక్యం ఉండకూడదు. 1861 పోలీస్ చట్టాన్ని ఈనాటికీ కొన సాగిస్తున్నామంటే మన పాలకుల ఉదాసీనతకు ఇంతకంటే వేరే ఉదాహరణ అవసరం లేదు. రాష్ట్ర జాబితాలోని పంచాయితీ, పట్టణ, స్థానిక సంస్థల విషయంలో.. 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా చట్టం రూపొందిం చినప్పుడు.. కాలం చెల్లిన పోలీస్ చట్టాన్ని ఎందుకు మార్చరు? అనే వ్యాఖ్యానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పోలీస్ యంత్రాంగంలో జవాబుదారితనం లోపించినప్పుడు ప్రజల హక్కులకు రక్షణ లభించదు. దీనికి తోడు కాలం చెల్లిన

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్. సోలి సొరాబ్జి కమిటీ, మలి మత్ కమిటీల సిఫార్సులను అమలు చేయడానికి అభ్యంతరమేమిటి? సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కుంటిసాకులు చెబుతున్నాయి. రెండో పాలనా సంస్కరణల సంఘం తన ఎనిమిదో నివేదికలో (2008) పోలీస్ యంత్రాంగ ప్రక్షాళనకు ఎన్నో సిఫార్సులు చేసింది. వాటికి కూడా జాతీయ పోలీస్ కమిషన్ సిఫార్సుల (1977–1983) గతే పడుతుందనే అభిప్రాయం నెలకొంది.

**ఇంటెలిజెన్స్ వ్యవస్థ పటిష్టం కావాలి:**

ముంబై దాడులకు సంబంధించిన సమాచారాన్ని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) రాష్ట్ర పోలీస్ యంత్రాంగానికి తెలియజేసినప్పటికీ దాన్ని రాష్ట్ర ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదనే విమర్శ ఉంది. సమాచార సమన్వయంలో మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. దీనికితోడు.. అంతరంగిక రహస్య సమాచారాన్ని సేకరించే ఇంటెలిజెన్స్ బ్యూరో.. విదేశాల నుంచి రహస్య సమాచారాన్ని సేకరించే రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (ఆర్ఏడబ్ల్యూ –రా) మధ్య సమన్వయం లోపించింది. ఇంటెలిజెన్స్ బ్యూరో హోంమంత్రిత్వశాఖకు జవాబుదారిగా ఉంటే.. రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ ప్రధాన మంత్రికి బాధ్యత వహిస్తుంది. పైగా ఈ రెండింటికీ చట్టబద్ధత లేదు. అది లేనప్పుడు సహజంగానే జవాబు దారితనం లోపిస్తుంది.

బ్రిటిష్ రహస్య సమాచార వ్యవస్థ M15కు చట్టబద్ధత ఉందన్న విషయాన్ని మనం గుర్తించాలి. ముంబై దాడుల నేపథ్యంలో జాతీయ విచారణ ఏజన్సీ ఏర్పాటుకు చట్టాన్ని రూపొందించారు. ఇటీవల జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో రాష్ట్రస్థాయిలో.. జాతీయ భద్రతా కమెండో బలగాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. కాని ఈ చిత్తశుద్ధి, దృఢ నిశ్చయం నిరంతరం ఉండాలి. సంక్షోభ సమయంలో తాత్కాలిక ఉపశమన చర్యలు చేపడితే ప్రయోజనం లేదు. చికిత్స కంటే నివారణ మేలనే విషయాన్ని గుర్తించాలి. **దేశ భద్రతకు మనం చెల్లించవలసిన మూల్యం: ప్రజల, ప్రభుత్వ నిరంతర అప్రమత్తత.**

- రాష్ట్రాలను విదేశీ దాడుల నుంచి అంతర్గత అలజడుల నుంచి రక్షించాల్సిన బాధ్యత కేంద్రానిదే అని పేర్కొన్న రాజ్యాంగ ప్రకరణ – 355
- మన దేశంలో ప్రస్తుతం అమలవుతున్న పోలీస్ చట్టం రూపొందిన సంవత్సరం – 1861
- మన దేశంలో మొత్తం సముద్రతీర సరిహద్దు – 7,516 కి.మీ.
- రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) ఎవరి నేతృత్వంలో పనిచేస్తుంది – ప్రధానమంత్రి
- బ్రిటిష్ రహస్య సమాచార వ్యవస్థ – M15
- కేంద్రం కొత్తగా ప్రారంభించిన సంస్థ పేరు – జాతీయ విచారణ ఏజన్సీ
- రెండో పాలన సంస్కరణల కమిషన్ ఎన్నో నివేదికలో పోలీస్ యంత్రాంగ ప్రక్షాళనపై సిఫార్సులు చేసింది – ఎనిమిదో నివేదిక (2008)